www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 28 | జూలై | 2026
పేజీలు : 8

## చదువే వ్యసనం కావాలి

-ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి




2 లో

## విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు






-ఉచితాలు కావు ప్రజా పెట్టుబడులు
-అర్ధాకలితో ఏ బిడ్డ బడికి వెళ్లొద్దు
-సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

**ప్రజాపక్షం/ మధిర :** విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని ఉచిత పథకాలు అనేవి ప్రభుత్వం ప్రజలపై పెట్టే పెట్టుబడి అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. చాలా మంది ఉచిత పథకాలపై విమర్శలు చేస్తున్నారని పరిశ్రమలు, ప్రాజెక్టులు, ఇతర అనేక అంశాలపై ప్రభుత్వం పెట్టుబడులు పెట్టినట్లుగానే పేదలు, దళితులు, వెనకబడిన వర్గాలు సహా ప్రజలందరిపై ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుందన్నారు. మధిర నియోజక వర్గ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహార అల్పాహారాన్ని అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సెంటర్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పుట్టిన ఏ బిడ్డ కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ఆశయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం ఉదయమే రుచికరమైన శుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా

మిగతా 2లో..

## సమగ్ర అభివృద్ధికి కృషి





-మౌలిక వసతుల కల్పనే ధ్యేయం
-పార్టీలకతీతంగా పేద వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తాం
-రూ.1.95 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/సుజాతనగర్:** కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల రూపురేఖలు మార్చేలా సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండల పరిధిలోని కార్పొరేషన్ డివిజన్‌లో రూ.1.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, బస్ షెల్టర్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుజాతనగర్ కార్పొరేషన్ ప్రాంతంగా మారిన తర్వాత మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ప్రతీ గ్రామంలో తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యలు

మిగతా 2లో..

## మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలి




-విద్యా విధానాన్ని సమూలంగా మార్చాలి
-ఢిల్లీ లాఠీచార్జ్‌పై విచారణ జరిపించాలి
-సిపిఐ నేత బాగం
-సిపిఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి

**ప్రజాపక్షం/ఖమ్మం :** నీట్ పరీక్షా పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. 21 మంది విద్యార్థుల ఆత్మహత్యకు మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సోమవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మృతి చెందిన విద్యార్థుల ఆత్మశాంతి కోరుతూ విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకు రావాలని డిమాండ్ చేస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.నివాళి అనంతరం బాగం హేమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పోరాట ఫలితంగా

మిగతా 2లో..

## అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి



-ప్రజాప్రతినిధులు, ప్రజలు పనులు పర్యవేక్షించాలి
-సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 43వ డివిజన్‌లో రూ.61.50 లక్షలు సుడా నిధులతో చేపట్టిన సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి పది కాలాల పాటు మన్నికతో ఉండేవిధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలు, నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలన్నారు. అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఖమ్మం నగరాభివృద్ధికి వందల కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక

మిగతా 2లో..

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

(మొదటిపేజీ తరువాయి)

అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉచిత అల్పాహార పథకాన్ని మధిర నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు ఒకే సమయానికి వేడిగా అల్పాహారాన్ని అందించడం దేశ చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించాల్సిన అంశమన్నారు. హరేకృష్ణ మిషన్ భాగస్వామ్యంతో పకడ్బందీగా అత్యంత శుభ్రమైన వాతావరణంలో మెకానైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధిరలో తాత్కాలిక సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 16 మండలాల స్కూళ్లకు వాహనాల్లో అల్పాహారాన్ని అందిస్తున్నామన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా శాశ్వత కిచెన్ నిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అల్పాహారంతో పాటు పౌష్టికాహారం కోసం వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావను ప్రత్యేకంగా అందిస్తున్నట్లు తెలిపారు. పాలన అంటే హోదా కాదని అధికారం అంటే పెత్తనం చెలాయించడం కాదన్నారు. ఉన్న వనరులను పోగేసి సమాజహితం కోసం ప్రణాళికలు తయారు చేయడం వారి అభివృద్ధి కోసం పునాదులు వేయడమేనన్నారు. ఇండ్లు లేని వారి కోసం ఐదు లక్షల సాయంతో ఇండ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేసిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజల కష్టాలను కనులారా చూశానని నాడు రూపుదిద్దుకున్న నా ఆలోచనలే నేడు పథకాలుగా అమలవుతున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్, ఎంఎల్‌సి శ్రీపాల్‌రెడ్డి, వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్, హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్, ది అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షులు సత్య గౌరా చంద్ర దాస స్వామిజీ, సింగరేణి సిఎండి బుద్ధ



ప్రకాష్ జ్యోతి, హరేకృష్ణ ఫౌండేషన్ సిఈవో కౌంతేయ స్వామిజీ, కార్పొరేషన్ ఛైర్మెన్లు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, డిఈవో సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసచారి, ఆర్అండ్‌బి ఎస్ఈ యుగంధర్‌రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, సిపివో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అల్పాహార కార్యక్రమం భవిష్యత్తులో దిగ్విజయంగా సాగాలని జరిపించిన నృసింహ మహా యాగంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని అనంతరం కిచెన్‌ను ప్రారంభించారు. అల్పాహారంతో పాటు మిల్క్ యూనిట్, యంత్రాలను, కూరగాయలు శుద్ధి చేసే మిషన్లు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఉప ముఖ్యమంత్రి అల్పాహారం చేశారు. అనంతరం వివిధ పాఠశాలలకు అల్పాహారం అందించే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

# సమగ్ర అభివృద్ధికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, సుజాతనగర్ నుండి శివాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు అందుబాటులోకి తెచ్చామన్నారు. సుజాతనగర్‌లో మున్సిపల్ సబ్ డివిజన్ కార్యాలయ ఏర్పాటుతో పాటు, సింగభూపాలెం చెరువుకట్ట అభివృద్ధి కోసం రూ.5.5 కోట్లు మంజూరు కానున్నట్లు వెల్లడించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ (న్యాక్) కేంద్రం మంజూరైందని, అదేవిధంగానియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రగతికి అవసరమైన నిధుల కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనులు వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సొసైటీ అధ్యక్షులు మండే హనుమంతరావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మున్సిపల్ కమిషనర్ సుజాత, కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ భారతి, ఏఓ నర్మద, విద్యుత్ శాఖ ఏఈ కిషన్, సిపిఐ మండల కార్యదర్శి కోమరి వీర హనుమంతరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు, సలిగంటి శ్రీను, వాసిరెడ్డి మురళి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లు, తాళ్లూరి పాపారావు, ధర్మారావు, సహాయ కార్యదర్శి లావుడియా గోపి, నాయకులు భాగం శేషభూషణం, శంకర్, భీమా, బండి రమేష్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, దుర్గాప్రసాద్, బొడ్డు కేశవరావు, దండు నాగేశ్వనరావు, గోరింట్ల ధర్మ సత్యం, కొమారి కృష్ణ, గంగాయ సురేష్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువే వ్యసనం కావాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జీవితంలో స్థిరపడాలంటే విద్యార్థులకు చదువే వ్యసనంగా ఉండాలని ఖమ్మం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, ప్రోహిబిషన్ ఎక్సైజ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ ఎఎల్ఎన్ శాస్త్రి అధ్యక్షతన గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమిరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజం బాగుంటే మనం బాగుంటామని విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే క్షణిక ఆనందం కోసం చెడు వ్యసనాలకు లోనుకాకూడదన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ఉక్కు పాదం మోపుతుందన్నారు. ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల శరీరం నాడి వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ గంజాయి కేసులో పట్టుబడితే పది నుంచి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. ఏదైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపాలన్నారు.ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగం వైస్ ప్రిన్సిపాల్ డా॥ సిహెచ్ శ్రీనివాస్, యాంటీ డ్రగ్ కమిటీ కో ఆర్డినేటర్ డా॥ మౌలానా, కరీం, ఐక్యూ ఏసి కో ఆర్డినేటర్ డా॥ సునంద, ఎన్‌సిసి ఆఫీసర్ డా॥ ఓంకార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా॥ ఎం. పిచ్చయ్య, డా॥ ఎంవి రమణ, డా॥ ధర్మయ్య, ఎక్సైజ్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను అమలు చేస్తున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పరిశుభ్రత వల్ల ఆరోగ్యంతో పాటు వైద్య ఖర్చుల భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**వరద ముప్పు, తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం...**

ఖమ్మం నగరంలో వరద గండం లేకుండా, తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. నగరంలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పురోగతిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్షేత్ర స్థాయిలో సోమవారం పరిశీలించారు. ఖమ్మం నగరానికి తాగునీటి ఎద్దడి లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కృష్ణానది నీళ్లు సరఫరా కానీ పక్షంలో గోదావరి నీళ్లతో పరిష్కారం చేయనున్నామన్నారు. ఖమ్మంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా రూ. 200 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 24 గంటలు తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోదావరి జలాలను మున్నేరు వరకు తరలించామని తెలిపారు. ఖమ్మం నగరంలో వరద ముప్పు పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టినట్లు



తెలిపారు. ఖమ్మం ఖానాపురం చెరువు నుంచి ధంసలాపురం చెరువు వరకు అండర్ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. ధంసలాపురం చెరువు వద్ద మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరద నీటి కాలువలకు కూడా ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. వాకర్స్‌కి ఆరోగ్యం, ఆహ్లాదకరంగా ఉండేందుకు రెండు లకారం చెరువుల మధ్యలో నాలా సుందరీకరణ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. తాగునీటి పథకం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, డిఈ నవీన్‌కుమార్, ఏఈలు నవ్యజ్యోతి, దివ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలి



**(మొదటిపేజీ తరువాయి)** కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని రాజీనామాతో సరిపెట్టకుండా ఢిల్లీలో విద్యార్థులు, యువతపై లాఠీచార్జ్ చేసిన పోలీస్ చర్యపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. భయపెట్టడం ద్వారా, హింసించడం ద్వారా బిజెపి ప్రభుత్వం యువత, విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నం చేసిందని పట్టుదలతో అవిశ్రాంతంగా పోరాడి విద్యార్థులు ప్రభుత్వం మెడలు వంచారన్నారు. విద్యార్థులకు సంబంధించి అనేక కేసులు నమోదు చేశారని ఒక్క ఢిల్లీలోనే కాకుండా దేశ వ్యాప్తంగా విద్యార్థులు, యువజనులపై కేసులు నమోదు చేశారని ఆ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని హేమంతరావు డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం విద్యారంగంలో పలు మార్పులు తీసుకు వచ్చిందని చరిత్రకు తూట్లు పొడిచి పసి మెదళ్లకు మతోన్మాదం ఎక్కించే ప్రయత్నంలో భాగంగా పాఠ్యాంశాలను రూపొందించారని దీనిని తక్షణం రద్దు చేయాలని, నూతన విద్యా విధానానికి రూపకల్పన చేయాలని హేమంతరావు కోరారు. కేవలం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సరిపెట్టకుండా విద్యా విధానంపై, ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలపైన ప్రభుత్వం దృష్టి సారించాలని అంత వరకు దేశ వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మిడికంటి వెంకటరెడ్డి, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ఎస్‌టియు జిల్లా కార్యదర్శి ఎస్‌కె కరీం, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు చింతల రమేష్, మద్దోజు శ్రవణ్, ఇటికాల రామకృష్ణ, మడుపల్లి లక్ష్మణ్, మనోజ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పుచ్చకాయల సుధాకర్, తాటి నిర్మల, ఎస్‌కె సైదా, జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు.

## రైతువేదికలో విత్తన మేళా



**ప్రజాపక్షం/మధిర:** మధిర రైతువేదిక నందు ఏర్పాటు చేసిన విత్తన మేళా కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తక్కువ నీటితో సాగయ్యే పెసర, మినుము, కంది, బొబ్బర్లు, నువ్వులు, జొన్నలు, కూరగాయల పంటలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. 27 నుండి 29 వరకు మూడు రోజుల పాటు రైతువేదికలో నిర్వహించే ఈ విత్తన మేళాని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మధిర ఏడిఏ వాణిశ్రీ, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త నాగస్వాతి, మధిర ఏవో సాయి దీక్షిత్, మధిర మండల ఏఈవోలు, ప్రజాప్రతినిధులు, రైతులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

## భూములు మావి.. నీళ్లు ఆంధ్రా రైతులకా..?

**విలేకరులతో బీఆర్ఎస్ నాయకులు గిరిబాబు**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించిన సీతారామ ప్రాజెక్టు నీళ్లను జిల్లా రైతులకు అందించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉంది కానీ.. ఈ జిల్లా రైతులు ఇచ్చిన భూముల్లో కాలువల తవ్వించి ఆంధ్ర ప్రాంతానికి నీళ్లను తరలించడం వలన భద్రాద్రి జిల్లా రైతాంగని తీవ్ర అన్యాయం జరుగుతుందని బిఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు అన్నారు. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని అనంతారం గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యదలపల్లి వీరభద్రం నివాసంలో సోమవారం గిరిబాబు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే సంకల్పంతో రూ.13,000 కోట్ల వ్యయంతో సీతారామ ప్రాజెక్టును చేపట్టారని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు రూపురేఖలను మార్చి, జూలూరుపాడు నుంచి ఏన్కూర్ సాగర్ కాలువలోకి అనుసంధానం చేసి నీటిని ఆంధ్ర ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ చర్యను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. భద్రాద్రి జిల్లాకు సంబంధించిన సీతారామ ప్రాజెక్టునీళ్ళను ఈ జిల్లా రైతాంగానికి అందించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉంది. రైతుల హక్కులను కాపాడేందుకు రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని గిరిబాబు హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చాపలమడుగు రామ్మూర్తి,యదలపల్లి వీరభద్రం, తాళ్లూరి రామారావు, పోతురాజు రామారావు, బండారి వెంకయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**-నేడు ఆర్టీవో కార్యాలయం ఎదుట ధర్నా**
**-ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మల్లేష్**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో, ప్రైవేట్ మోటార్ కార్మికులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా గౌరవాధ్యక్షులు పగడాల మల్లేష్ కోరారు. సోమవారం గిరిప్రసాద్ భవన్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తో కలిసి పగడాల మల్లేష్ మాట్లాడుతూ రాత్రింభవళ్లు శ్రమిస్తూ ప్రజలను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్చే ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ఇటీవల మారుతున్న పరిస్థితులు, ఆర్థిక భారం వల్ల ఆటో డ్రైవర్లు తమ కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర మానసిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మహాలక్ష్మి పథకం కారణంగా ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతిన్న నేపథ్యంలో ప్రభుత్వం హామీ ఇచ్చినవిధంగా అర్హులైన ప్రతి ఆటో డ్రైవర్‌కు యేటా రూ. 12వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలన్నారు. నిబంధనల పేరుతో ఆటో డ్రైవర్లపై చలానాలు విధించడం, పోలీసుల వేధింపులు నిలిపివేయాలన్నారు. పెండింగ్ చలానాలపై ఒకేసారి రాయితీ కల్పించాలని కోరారు. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా పట్టణాలు, నగరాల్లో ఆటోల నిలుపుదలకు అధికారిక స్టాండ్లను కేటాయించి అక్కడ తాగునీరు, నీడ, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 28న ఆర్టీవో కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆటో, ప్రైవేట్ మోటార్స్ ఓనర్స్, డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల శ్రీనివాస్, పేరబోయిన మోహన్‌రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, బండి పుల్లారావు, సహాయ కార్యదర్శి షేక్ రఫీ, వెంకట్రావు, కోశాధికారి సతీష్ పాల్గొన్నారు.

# 28వ వార్డును అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి

**- కౌన్సిలర్ దండి రంగారావు**
**- రంగారావును సన్మానించిన చైతన్యనగర్‌కాలనీ వాసులు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీలోనే తన వార్డును అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రజల సహకారంతో నిరంతర కృషి చేస్తానని సిపిఐ 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు అన్నారు. సోమవారం 28వ వార్డులోని చైతన్య నగర్‌లో కాలనీవాసులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు శాలువాతో సన్మానించి, మెమోంటాను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...వార్డుల్లో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. మట్టిరోడ్ల స్థానంలో దశలవారీగా సీసీరోడ్ల



నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ విస్తరణ పనులు కూడా ప్రక్రియలో ఉన్నాయన్నారు. వార్డు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని, డ్రైనేజీలు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, తాగునీటి సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రజలు సూచించే సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా పారదర్శకంగా సేవలందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, చైతన్యనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు, పంట కుంటలపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మండల పరిధిలోని చెరుకుపల్లి, గంగారం, రామనగరం, యాతలకుంట, కిష్టాపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇతర శాఖల సమన్వయంతో ఆరుతడి పంటలు, పంట కుంటల నిర్మాణంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి.ఎన్.కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే పెసర, మినుము, కంది, నువ్వులు, జొన్న వంటి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బోర్లపై ఆధారపడే రైతులు తమ మొత్తం సాగు విస్తీర్ణంలో 50 శాతం



మేర మాత్రమే సాగు చేపట్టడం ద్వారా నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. అలాగే పంట కుంటల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవచ్చని, దీంతో సాగు వ్యయం తగ్గడంతో పాటు పంటల స్థిర దిగుబడికి దోహదపడుతుందని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఆశాజ్యోతి, నరేష్, అనూష, సాయి వాసంతి తదితరులు పాల్గొన్నారు.

# మెగా రక్తదాన శిబిరం

**-స్వచ్ఛందంగా 100 మందిరక్తదానం**
**-కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని కమల్ మిత్ర మోటార్స్ అండ్ ఫార్మసీ అధినేత రెహ్మాత్ పాషా జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ రక్తదానం మహాదానం. ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుంది. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఎంతో అభినందనీయం. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న కమల్ మిత్ర మోటార్స్ అండ్ ఫార్మసీ నిర్వాహకులు అభినందనీయులు అని అన్నారు.శిబిరంలో సుమారు 100 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి వారి సేవా స్ఫూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డా. సూర్యనారాయణ, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి రక్తదాన విభాగం సిబ్బంది, వాహిద్, అహ్మద్, వలి, సన్నీ, ముస్తఫా, ఫిరోజ్ తదితరులు, కమల్ మిత్ర మోటార్స్ అండ్ ఫార్మసీ సిబ్బంది, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు.

# సిపిఐ సీనియర్ నాయకుడు మృతి

**- నివాళులర్పించిన సిపిఐ నేతలు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెకోడుతండాకు చెందిన సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు బానోత్ మున్ను(93) వృద్ధాప్యంతో సోమవారం ఇంటి వద్ద కన్నుమూశారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, సిపిఐ నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. నివాళులర్పించి వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎడ్లపల్లి శంకరయ్య, బానోత్ రాంకోటి, పగిళ్ల వీరభద్రం, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మాజీ ఎంపీపీ ఆరెంపుల సైదులు, ఉప సర్పంచ్ కొరివి వీరన్న, గ్రామ సిపిఐ నాయకులు రామ్‌నాయక్, బానోత్ సీతారాం, గుగులోత్ హరిదాస్, వలిసిన శ్రీను, బానోత్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు వేసుకోండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఎలినినో ప్రభావం వలన ఈసంవత్సరం వర్షాలు తక్కువగాపడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేయాలని మండల వ్యవసాయ అధికారి దొడ్డిగార్ల బాలాజీ అన్నారు. మండల కేంద్రం కొణిజర్ల గ్రామపంచాయతీ కార్యాలయంనందు సోమవారం సర్పంచ్ గూదె పుష్పావతి అధ్యక్షతన ఏర్పాటుచేసిన రైతుసభలో బాలాజీ మాట్లాడుతు 75 సంవత్సరాల తర్వాత ఇలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఎన్ఎస్‌పి కాలువ నీరు కూడా రాదని బోరుబావుల్లో కూడా నీరు తగ్గిపోతుందని దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. వరి పంట వేయవద్దని వ్యవసాయ శాఖ వారి సూచనలు, సలహాలు పాటించి లాభదాయకమైన పంటలు సాగుచేసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సొసైటి చైర్మన్ నెల్లూరి రమేష్, పంచాయతీ కార్యదర్శి రమేష్, జిపిఓ గురుమూర్తి, సిసి భిక్షం, పశుల వైద్యాధికారి రాకేష్, కోఆప్షన్ సబ్యులు మౌలానా తదితరులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అబ్బూరి



**ప్రజాపక్షం/చింతకాని :** ఖమ్మం జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గా చింతకాని మండలం రాఘవాపురం ఉపసర్పంచ్ అబ్బూరి మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ నియామక పత్రాన్ని ఆదివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో అందజేశారు. మహేష్ నియామకం పట్ల సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిలా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జున్, కూచిపుడి రవి, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మండలంలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు వంగూరి రమేష్, కార్యదర్శి కూచిపుడి బుచ్చిబాబు, నాయకులు అంబటి శరత్, చిట్టిమోదు రాంబాబు పలు పార్టీల నాయకులు మహేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఉపసర్పంచ్‌ల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. తనపై నమ్మకంతో ఈ భాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# అల్పాహార పథకం ప్రారంభం



**ప్రజాపక్షం/ముదిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న అల్పాహార ఫథకాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొమ్మినేని రమేశ్‌బాబు, సర్పంచి పెరుమాళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఉదయం పూట విద్యార్థులకు అల్పాహారం ద్వారా విద్యార్థులు ఉత్సాహంగా హాజరై, ఏకాగ్రతతో చదువుకుని మెరుగైన విద్యా ఫలితాలు సాధించే అవకాశాలు పెరుగుతాయని అన్నారు. భవిష్యత్ తరాలను ఆరోగ్యవంతులుగా విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి మీగడ శ్రీనివాస్, పొన్నం రమేశ్, తోటమళ్ల భారత్, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయుడు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు పాల్గొని అల్పాహారం వడ్డించి విజయవంతం చేశారు.

# గోపాలమిత్రల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/ముదిగొండ:** గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధిలో గోపాలమిత్రల పాత్ర కీలకమైందని డీఎల్‌డీఏ వైద్యాధికారి కె.కిశోర్ కుమార్ పేర్కొన్నారు. ముదిగొండ రైతు వేదికలో ముదిగొండ, నేలకొండపల్లి మండలాల గోపాల మిత్రలకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. పాడి పశువుల్లో కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశుసంపదను పెంపొందించేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పశువులకు అవసరమైన టీకాలు వేయించడం, ప్రాథమిక వైద్య సేవలు అందించడం, అంటువ్యాధుల నివారణకు చర్యలు చేపట్టడం, పశువుల వివరాల నమోదులో పశు వైద్యసిబ్బందికి సమకరించడం వంటి బాధ్యతలు గోపాలమిత్రలు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారులు అశోక్, రమేశ్‌బాబుతోపాటు ముదిగొండ, నేలకొండపల్లి మండలాల గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## ఎకరానికి రూ 20లక్షల పరిహారం చెల్లించాలి

**-సీతమ్మసాగర్ నిర్వాసిత రైతుల వినతి**



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** సీతమ్మసాగర్ ప్రాజెక్టు మూడో విడత భూసేకరణలో భాగంగా ఎల్ ఎన్‌రావు పేట, పెదబండిరేవు గ్రామాల భూ నిర్వాసిత రైతులకు ఎకరానికి కనీసం రూ 20 లక్షల నష్టపరిహారం ప్రకటించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంఓ ఏఓ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అన్ని గ్రామాల రైతులకు ఒకే విధమైన పరిహారం చెల్లించాలని, భూ రిజిస్ట్రేషన్ పేరుతో వేర్వేరు రేట్లు అమలు చేయవద్దని కోరారు. గతంలో తక్కువ పరిహారం వల్ల రైతులు నష్టపోయారని, గోదావరి ఒడ్డున ఉన్న భూములకు కూడా సమాన నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో చర్ల, దుమ్ముగూడెం మండలాల భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షులు కొమురం దామోదర్‌రావు, పూనెం భూపతిరావు, నారాయణ, రామారావు, మిడియం సుభద్ర, సోడియం బుల్లెమ్మ, ముక్కెర నాగమణి, రాఘవయ్య, పూనెం అర్జున్, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

## టీయూజేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బండి వెంకట్ గౌడ్ నియామకం



**ప్రజాపక్షం/కామేపల్లి:** తెలంగాణ ఉద్యమకారుల సంయుక్త కార్యాచరణ కమిటీ(టీయూజేఏసీ)రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఖమ్మం జిల్లా ఉద్యమకారుడు బండి వెంకట్‌గౌడ్ నియమితులైనట్లు టీయూజేఏసీ వ్యవస్థాపకులు, రాష్ట్ర ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఈసందర్భంగా గాజుల యాదగిరి, అనుముల రవీందర్, భూక్యా వెంకన్న, మొతుకూరి మల్లేష్, కృష్ణయ్య, యాదయ్య, పఠాన్ జలాని, నాగుల్ మీర, ప్రకృద్దీన్, ఆదేర్ల శంకర్‌తో పాటు ఉద్యమకారులు, కళాకారులు బండి వెంకట్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## కామేపల్లిలో మొక్కుబడిగా గ్రీవెన్స్ డే

**గైర్హాజరైన అధికారులపై చర్యలు శూన్యం**

**ప్రజాపక్షం/కామేపల్లి:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం స్థానిక తహసీల్థార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి(గ్రీవెన్స్ డే)కార్యక్రమం అధికారుల పుణ్యామా అని అబాసు పాలవుతుంది. ప్రతి సారి ఇదే తంతు కొనసాగుతోంది. కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. మరికొన్ని శాఖల అధికారులు వారి క్రిందస్థాయి అధికారులను ప్రజావాణికి పంపుతున్నారు. మరికొన్ని శాఖల అధికారులు నెలల తరబడి గ్రీవెన్స్ డేలో పాల్గొనడం లేదు. ఇంత జరుగుతున్నా ఆయా శాఖల అధికారులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రజావాణిలో సమస్యలు ఫిర్యాదు చేస్తే పరిష్కారం కావడం లేదని బాధితులు పేర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వం, ఫిర్యాదుదారుల ఆశయాలు నీరు గారి పోతున్నాయి. కేవలం మొక్కుబడిగా కాకుండా, ప్రజా సమస్యలు పరిష్కరించే వేదికగా, అన్ని శాఖల అధికారులు పాల్గొనే విధంగా గ్రీవెన్స్ డేను నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఆగస్టు 10 జైల్ భరోను జయప్రద్రం చేయండి



**ప్రజాపక్షం/కారేపల్లి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం సింగరేణి మండల కమిటీ, శాఖ కార్యదర్శుల సమావేశం రేగళ్ల మంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, 29 కార్మిక చట్టాల పునరుద్దరణ, ఉపాధి హామీ చట్ట పరిరక్షణ, రైతులకు చట్టబద్ద కనీస మద్దతు ధర అమలు, విద్యుత్ చట్టం ఉపసంహరణ తదితర డిమాండ్ల సాధన కోసం ప్రజలు జైల్ భరోలో పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో భూక్య వీరభద్రం, కొండబోయిన నాగేశ్వరరావు, కే నరేంద్ర, వజ్జా రామారావు, కొండబోయిన ఉమావతి, ఎండీ ఇస్మాయిల్, కేసగాని ఉపేందర్, ముండ్ల ఏకాంబరం, అజ్మీర్ శోభన్ బాబు, కల్తి రామచంద్రరావు, జి వెంకన్న, తుమోజు రామ్మూర్తి, కరపాటి సీతారాములు, ఎజు రత్నం, సురభాక సర్వయ్య, బానోత్ కిషన్, దార్ల బాబు, శేఖర్, ధరావత్ వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేతో రైతులకు ప్రయోజనం



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** భూభారతి కార్యక్రమంలో చేపడుతున్న భూముల రీ సర్వే ప్రతి రైతుకు ఎంతో ఉపయోగకరమని దుమ్ముగూడెం తహసీల్ధార్ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం సంగం, గుర్రాలబయలు, లింగాపురం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో పాల్గొని రీ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. భూ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో భూ సర్వే అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలను అందించాలి

**- కలెక్టర్ అంకిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** ప్రతీ ఒక్కరికి మెరుగైన వద్య సేవలను అందించి ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మిదేవిపల్లి మండల పరిధి రేగళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన కస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, జ్వర కేసులు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, జ్వర లక్షణాలతో వచ్చే ప్రతీ రోగికి అవసరమైన పరీక్షలు నిర్వహించి వెంటనే చికిత్స అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. మందుల కొరత లేకుండా తగిన నిల్వలను సిద్దంగా ఉంచుకోవాలని సూచించారు.యాంటీ స్నేక్ వీనం ఇంజెక్షన్‌లను అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు విశ్వాసం పెరిగేలా ప్రతీ రోగికి సకాలంలో వైద్య సేవలను అందించాలని ఆదేశించారు.

# రూ. 42లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**- అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎంఎల్‌ఏ పాయం**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో రూ 42లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు సోమవారం శిలాఫలకాలు ఆవిష్కరించి ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీసీ హాస్టల్‌లో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ 30లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చింతిర్యాల గ్రామ పంచాయితీ పరిధిలోని కట్టం వారిగూడెంలో రూ 12లక్షలతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని ఎంఎల్‌ఏ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గాదె కేశవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బరాజు సంపత్, నెల్లిపాక సొసైటీ ఛైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు సబ్కా పిచ్చయ్య, కలివేటి సరిత, తెల్లం నాగమణి, యేనిక ఉషారాణి, కుంజా జాను, ఉప సర్పంచులు మేకల అంజిబాబు, యెక్కటి పున్నారెడ్డి, హర్షా నాయక్, శీలం సంజీవరెడ్డి, నాయకులు బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, వేములపల్లి రమేష్, లంకమల్ల కొండలరావు, బట్టా సత్యనారాయణ, ఎండి శర్ఫుద్దీన్, కాకా రాములు, నాగయ్య, వీరభద్రా రెడ్డి, నరసింహారావు, తెల్లం వీరభద్రం, ఆవుల రవి, వెంకన్న, ఎనిక రవి బాబు, లోడిగా నరసింహారావు, విజయ్, శశికాంత్, రాము, సంతోష్, నాగరాజు, వెంకటేశ్వర్లు, కొమ్ము వెంకన్న, ముత్తయ్య, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# అంబులెన్స్‌లోనే ప్రసవం

**-చింతకుంట ఆదివాసి గ్రామంలో హృదయవిదారక ఘటన**
**-పాలకుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు పరిధిలోని చింతకుంట ఆదివాసి గ్రామంలో రోడ్డు సౌకర్యం లేక గర్భిణీకి అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగిన ఘటన స్థానికులను కలిచివేసింది. గ్రామానికి చెందిన సోడి మార్తకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌ను పిలిచారు. గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో అంబులెన్స్ తీవ్ర ఇబ్బందుల మధ్య అక్కడికి చేరుకుంది. ఆసుపత్రికి తరలిస్తుండగా రహదారిలోని గుంతల కారణంగా నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌ను మార్గమధ్యలో నిలిపివేయాల్సి వచ్చింది. ఈఎంటీ రాధ సమయస్ఫూర్తితో అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించగా, సోడి మార్త పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, బిడ్డను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈఘటనతో చింతకుంట గ్రామస్తులు పాలకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే ప్రజాప్రతినిధులు గెలిచిన తర్వాత గ్రామాల అభివృద్ధిని విస్మరిస్తున్నారని విమర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రయాణించలేని రహదారిని వెంటనే పునరుద్దరించి, ఆదివాసి గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అపాయ సమయంలో తల్లి, శిశువు ప్రాణాలను కాపాడిన 108 పైలట్ విజయభాస్కర్, ఈఎంటీ రాధ సేవలను గ్రామస్తులు అభినందించారు.

# వైభవంగా ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు

**-బోనాలతో తరలివచ్చిన మహిళలు**
**-భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు పూజలు**



**ప్రజాపక్షం/కామేపల్లి:** ఆషాఢ మాసం సందర్భంగా కామేపల్లి మండలం తాళ్లగూడెం గ్రామంలో బోనాల ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల సమిష్టి సహకారంతో జరిగిన వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పుచ్చకాయల రామకృష్ణ, అరుణ దంపతుల తొలి బోనంతో ప్రారంభమైన వేడుకలు డప్పులు, వాయిద్యాలు, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. మహిళలు బోనాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి గ్రామ చివరన ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈకార్యక్రమంలో పుచ్చకాయల రామకృష్ణ, అరుణ దంపతులు, ఆరో వార్డు సభ్యురాలు తెల్లబోయిన అరుణ రామ్, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, రెండో వార్డు సభ్యులు పుచ్చకాయల చిన్న వెంకటేశ్వర్లు, నాయకులు ముత్యం రామకృష్ణ, గురుస్వామి పెరుగు అచ్చయ్య, కంపచాటి కృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న సింగభూపాలెం చెరువు..!

**వర్షాలు లేక అన్నదాతల్లో ఆందోళన**



**ప్రజాపక్షం/సుజాతనగర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అతిపెద్ద చెరువులలో సింగభూపాలెం చెరువు ప్రధానమైనది. చెరువు సుమారు 1200 ఎకరాలలో చెరువు విస్తీర్ణం కలిగి, దీని ఆయకట్టు కింద 2200 ఎకరాల పంటలు సాగు అవుతున్నాయి. చెరువుకు ఎడమ కాలువ కుడి కాలువ ల ద్వారా సుజాతనగర్ మండలంలోని అనేక గ్రామాల రైతుల పంట పొలాలకు నీరు అందుతుంది. ముఖ్యంగా వరి, ప్రత్తి, మొక్క జొన్న, కూరగాయలు, ఆకుకూరల పంట సాగు అవుతున్నది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెడు చెరువు పూడికతీతతో నీటి సామర్థ్యం పెరిగి ఖరీఫ్, రబీ పంటలకు నీరు పుష్కలంగా అందింది. వేసవి కాలంలో చెరువులో నీటి సామర్థ్యం ఉండడం వలన బోర్లు, బావి లలో కూడా నీరు సమృద్ధిగా ఉండేది. ఈ సంవత్సరం ఎలినివో ప్రభావంతో సరైన వర్షాలు లేకపోవడంతో చెరువుకు కొత్తనీరు రాలేదుజ ఎడమ కాలువ దగ్గర 20 అడుగుల నీరు చేరితే అలుగు పారుతుంది. కుడి కాలవ కు 18 అడుగులు రావాలి. చెరువు నీటిపై ఆధారపడి వర్షాలకు నిండుతుందని రైతుల ముందుగానే తమ నారుమూడులను సిద్ధం చేసుకుని నారు పోసుకుని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. నారు మడులకు నీరు అందకపోవడంతో పోసిన నారు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. సింగభూపాలెం చెరువుకు అనుసంధానంగా సీతారామ సాగర్ కాలువ నీటిని మళ్లీస్తే చెరువు నుండి అవకాశం ఉందని పలు రైతులు రెండు పంటలకు నీరు అంతా అవకాశం ఉందని చెబుతున్నారు. చెరువు నీరు వెళ్లే కాలులలో చెత్త చెదారం నిలువ ఉండటంతో నీరు వెళ్ళటం ఇబ్బందిగా ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోని కాలువలో పేరుకుపోయిన సిల్టు తీపియాలని రైతులు కోరుతున్నారు. ప్రతి పంట వేసిన రైతులు వర్షాలు లేక వేసిన ప్రతి విత్తనాలు మల్ల ఒక్క పోవడంతో ఒక్కొక్క రైతు మూడుసార్లు గింజలు వేయవలసి వచ్చింది. బ్యాంకుల్లో రైతులకు రుణాలు ఇవ్వడం లేదని అనేక షరతులతో రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా యాప్ సరిగ్గా అర్థం కాక సరైన సమయానికి యూరియా అందగా రైతు ఇబ్బందులు పడుతున్నారు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తే కాలం కలిసి రావడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశానికి వెన్నుముక ఆయన రైతు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని రైతులు, రైతు సంఘం నాయకులు మండిపడుతున్నారు.

# కూరగాయల్లో కింగ్ బోడ కాకరకాయ..!

**-చికెన్, మటన్‌కు దీటుగా పోషకాలు**
**-గ్రామీణ కూరగాయలకు గ్లోబల్ క్రేజ్**





**ప్రజాపక్షం/వైరా:** ప్రకృతి సాధించిన ఎన్నో ఔషధ గుణాలు కలిగిన కూరగాయల్లో బోడ కాకరకాయ ప్రత్యేక స్థానం కలిగి ఉంది నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా లభించే ఈ కూరగాయల్లో శరీరానికి అవసరమైన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు సంవృద్ధిగా ఉంటాయని పేర్కొంటున్నారు. బోడ కాకరాయలో ఉండే పోషకాలు మధుమేహం నియంత్రణకు, రక్తపోటు సమతుల్యంగా ఉంచేందుకు సహాయపడతాయని చెబుతున్నారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, పోలేట్లు, శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని పలువురు పలువురు తెలుపుతున్నారు. అధికంగా ఉండే పీచు పదార్థం వలన జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. తుక్కువ కేలరీలు ఉండటంతో బరువు తగ్గాలనకునే వారికి ఇది ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులో ఉండే బీటా కెరోటిన్, విటమిన్ ఏ కంటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వంటల్లోను ప్రత్యేక రుచి బోడ కాకరకాయను సాధారణంగా వేపుడు, పులుసు, కూర రూపంలో వండుతారు. వండే ముందు ముళ్లను తొలగించాల్సిన అవసరం లేదని, శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసుకుంటే సరిపోతుందని వంట నిపుణులు చెబుతున్నారు. లేత విత్తనాలు ఉంటే అలాగే వండుకోవచ్చు. గట్టి విత్తనాలు ఉంటే తొలగించి ఉపయోగించాలి. ప్రకృతి అందించే ఈ అరుదైన కూరగాయను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

## మణుగూరు సింగరేణి చెక్ పోస్ట్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు సింగరేణి చెక్ పోస్ట్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం. రామ నరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం మణుగూరు ఏరియాలోని సింగరేణి చెక్ పోస్ట్ ప్రాంతాన్ని మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో పర్యవేక్షించడం జరిగింది. అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు పై చెక్ పోస్ట్ దగ్గర ప్రయాణించే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వర్షాకాల పరిస్థితులలో, వాటర్ స్ప్రే చేసినప్పుడు రోడ్డుపై ప్రయాణించేవారు మోటార్ సైకిల్స్ పై నుండి జారీ పడిపోతున్నారని పలువురు ఇప్పటికే జారిపడి ప్రాణాపాయం నుండి బయటపడ్డారని అన్నారు. ఈ సమస్య పరిష్కారం కొరకు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. సింగరేణి చెక్ పోస్ట్ లో సీలింగ్ మొత్తం డ్యామేజీ అయి ఉందని, డస్ట్ వలన సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, వర్షాకాలంలో కురుస్తుందని అన్నారు. వెంటనే చెక్ పోస్ట్ పటిష్టం చేసి, ఏసీ లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి షిఫ్టుకు 100 నుండి 175 లారీలు ఈ చెక్ పోస్ట్ నుండే రవాణా అవుతున్నాయని కంపెనీ వాహనాలు, కార్మికుల వాహనాలు, లారీలు నడుస్తున్న ఈ ప్రాంతం డేంజర్ జోన్ గా మారిందని కావున యాజమాన్యం కార్మికుల, వాహనదారుల రక్షణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుకున్నామని అన్నారు. ఏఐటియుసి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యవేక్షణలో వైస్ ప్రెసిడెంట్ రామ్ నరసయ్య, జీఎం కమిటీ సభ్యులు ఆవుల నాగరాజు, ఆఫీస్ బేరర్ అదేర్ల సురేందర్, పిట్ సెక్రటరీ శనిగరపు కుమార్ స్వామి పాల్గొన్నారు.

## సిపిఐ పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి**



**ప్రజాపక్షం/మణుగూరు:** సిపిఐ కార్యాలయంలో పినపాక నియోజకవర్గం స్థాయి సమావేశం ఈ నెల 28 మధ్యాహ్నం 3 గంటలకు మణుగూరులో నిర్వహించనున్నామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి తెలిపారు. ఈ సమావేశం కు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా హాజరు కానున్నారని, కావున నియోజకవర్గం లో ఉన్న అన్ని మండల, పట్టణ కార్యదర్శి లు, జిల్లా సమితి సభ్యులు,మండల, పట్టణ సహాయ కార్యదర్శిలు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఏఐటీయూసీ, మహిళా, గిరిజన, యువజన,ప్రజా సంఘాల బాధ్యులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, శాఖ కార్యదర్శి లు సకాలంలో 3 గంటలకు హాజరు కాగలరని కోరారు.

## ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ నాయకులు, యువకులు, మహిళలు, దొరపటేళ్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పాయం నరసింహారావు పిలుపునిచ్చారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. 1/70 చట్టం, పేసా చట్టం, అటవీ హక్కుల చట్టాలను సమర్థంగా అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఐడబ్ల్యూసీ నాయకులు జోగా రాంబాబు, కొమరం వెంకటేశ్వర్లు, కొమరం వెంకటకృష్ణ, కొమరం సతీష్, కల్తీ జోగయ్య, కల్తీ పాపయ్య, గోగ్గల బాబురావు, ఈసం సారయ్య, ఊకె నరేష్ పాల్గొన్నారు.

## దిశా కమిటీ సభ్యుడిగా మురళీ కృష్ణ నాయక్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు బూర్గంపాడు మండలం అంజనాపురం గ్రామానికి చెందిన బానోత్ మురళీ కృష్ణ నాయక్ దిశా కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వారాల వేణు గోపాల్, తేజావత్ సీతారాం నాయక్ పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

**-ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం**



**ప్రజాపక్షం/అశ్వాపురం :** ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అశ్వాపురం పరిధిలో 4.760కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ ఆదేశాల మేరకు ఎస్ఐ సీహెచ్ శ్రీహరిరావు బృందం అశ్వాపురం మండలం గొల్లగూడెం సమీపంలోని సీతారామ కెనాల్ వద్ద తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో హీరోగ్లామర్(ఏపీ24ఏఎస్6802)ద్విచక్ర వాహనంలో గంజాయిని గుర్తించి, జాల సందీప్(నల్లొండ జిల్లా)తో పాటు ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కలిమెల నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తుండగా పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. రూ 2.96లక్షల విలువైన గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ కోసం మణుగూరు ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు వీరబాబు, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి కాంగ్రెస్ సేవాదళ్ కమిటీల ఏర్పాటు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ విభాగాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా కమిటీల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించనున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కేశబోయిన నరసింహారావు తెలిపారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో కాంగ్రెస్ సేవాదళ్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ జీ , తెలంగాణ సేవాదళ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోదుమూరి దయాకర్ రావులను కలిసి సేవాదళ్ విస్తరణపై చర్చించినట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కమిటీల ఏర్పాటుకు పలు సూచనలు అందినట్లు పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి అన్ని మండలాలు, నియోజకవర్గాల్లో సేవాదళ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పార్టీలో అంకితభావంతో పని చేసే నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు, వర్గాలు, గ్రూపులకు అతీతంగా ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సేవాదళ్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని కేశబోయిన నరసింహారావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రజా సేవ లక్ష్యంగా సేవాదళ్ పని చేస్తుందని పేర్కొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేయాలి



**ప్రజాపక్షం/కూసుమంచి:** వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వరిపై మాత్రమే ఆధారపడకుండా తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య సూచించారు. కూసుమంచి రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళాలో ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించి సాగు ప్రణాళికలపై అవగాహన కల్పించారు. పెసర, కంది, జొన్న, ఆముదం, కూరగాయల వంటి పంటలు సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసి, శాస్త్రీయ సాగు పద్దతులు అవలంభించాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రాజేష్, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలి



**-వైద్య సంస్థలకు రెన్యువల్, రిజిస్ట్రేషన్‌కు ముందు తనిఖీలు నిర్వహించాలి : అదనపు కలెక్టర్ పి. శ్రీజ**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం వైద్య సంస్థల నమోదు పునరుద్ధరణ ప్రక్రియలో నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ పాల్గొని వైద్య సంస్థల రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ నిబంధనల అమలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సంస్థలకు రిజిస్ట్రేషన్, రెన్యువల్ మంజూరు చేసే ముందు ప్రతి ఆసుపత్రిని క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో తనిఖీలు చేయాలని ఆదేశించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంలోని అన్ని నిబంధనలు తప్పనిసరిగా అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని ఏమైనా లోపాలు గుర్తించినట్లయితే సంబంధిత యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి నిర్దిష్ట గడువు లోగా వాటిని సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోపాలను సరి చేయని వైద్య సంస్థలకు రెన్యువల్ మంజూరు చేయరాదన్నారు. రోగులు వారి సహాయకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వైద్య సంస్థలో పార్కింగ్ సౌకర్యం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిహెచ్‌సి, ఉప ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సామగ్రి పనుల అంచనాలను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలన్నారు. జిల్లాలో ఆయుష్ కేంద్రాలు, డయాగ్నస్టిక్ సెంటర్లు, క్లినికలు, దంత వైద్యశాలలు కలిపి మొత్తం 689 వైద్య సంస్థలు నమోదు కాగా వాటిలో 595 యాక్టివ్, 94 ఇన్ యాక్టివ్‌గా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 47 ప్రొవిజనల్ సర్టిఫికెట్లు జారీ చేయగా తొమ్మిది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని 25 శాశ్వత సర్టిఫికెట్లు జారీ చేయగా నాలుగు దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. 21 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని మరో 12 దరఖాస్తులు ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం పోలీస్ శాఖ వద్ద 12 దరఖాస్తులు డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్, ఏసిపి, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో, కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**-ప్రజల అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజలు తమ సమస్యలను తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కె. సక్కుబాయమ్మ సర్వే నెం. 257/ఎఏలో ఉన్న 5.26 ఎకరాలకు జారీ చేసిన నాలా అనుమతిని రద్దు చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం పాలక వర్గ సభ్యులు తమ గ్రామంలో రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న అంబేద్కర్ విగ్రహాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలోకి మార్చడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేశారు. పిడిఎస్‌యు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులకు పరుపులు, బెడ్లు అందించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ విబి జీ రాం జీ ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో అశోక్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ఎన్ఎంఎంఎస్ అటెండెన్స్ నమోదు బాధ్యతలతో పాటు మండల కేంద్రంలో జరిగే రివ్యూ సమావేశాలకు హాజరయ్యేందుకు రవాణా ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షులు బిరిగెల కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తూరుగంటి సూర్యం, మండల కార్యదర్శి భూక్యా బాలాజీ, ప్రసాద్, రవి, నాగులమీరా, శ్రీను, భద్రు, ఉపేందర్, మస్తాన్, వెంకటేశ్వర్లు, శారద, రమాదేవి, శ్రీదేవి పాల్గొన్నారు.

# వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలు..!



**-ఒకటి మరవక ముందే మరో దొంగతనం**
**-కాకరవాయిలో భారీ చోరీ**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో వరుస దొంగతనాలు చోటు చేసుకుంటుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఒక దొంగతనం ఘటన మరువక ముందే మరొక చోరీ జరగడం మండల వ్యాప్తంగా కలకలం రేపుతోంది. తాజా ఘటన కాకరవాయి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బూరగొమ్ముల సతీష్ కొంతకాలంగా తన భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కాకరవాయిలోని తన ఇంటికి తాళాలు వేసి ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు ఎవరూలేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి లోపికి ప్రవేశించారు. అనంతరం బీరువాను ఇనుపరాడ్లతో ధ్వంసం చేసి అందులో ఉన్న రెండు తులాల పుస్తెల తాడు, ఒకటిన్నర తులాల నల్లపూసల తాడు, సుమారు 20తులాల వెండి పట్టీలు, రూ.1లక్ష నగదు అపహరించినట్లు సమాచారం. ఆదివారం గ్రామంలో జరిగిన ఓ కుటుంబ వేడుకకు హాజరైన సతీష్ అనంతరం తన ఇంటికి వెళ్లి తలుపులు తెరిచి చూడగా బీరువా పగలగొట్టబడి ఉండటంతో చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్సై కూచిపూడి జగదీష్ తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని జరిగిన తీరును పరిశీలించారు. ఆధారాలను సేకరిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపింది. వరుసగా చోటుచేసుకుంటున్న దొంగతనాలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు, ఒంటరిగా నివసించే వృద్ధులు, తాళాలు వేసి బయటకు వెళ్లే కుటుంబాలు భయంతో వణికిపోతున్నారు. రాత్రి వేళల్లో పోలీస్ గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని, నిందితులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. వరుస దొంగనాలకు పోలీసులు చెక్ పెడతారా, దండుగులను పట్టుకుని ప్రజలకు భరోసా కల్పిస్తారా అనే ప్రశ్నలు ప్రస్తుతం మండల వ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

# ఉచిత జర్మన్ భాషా శిక్షణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మంజిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి కార్యాలయం, టామ్ కామ్ ఆధ్వర్యంలో నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఉచితంగా జర్మన్ భాషా శిక్షణా కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీలో వైద్య రంగంలో అర్హత కలిగిన నర్సింగ్, ఫిజియోథెరపీ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ శిక్షణా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జర్మన్ భాషా శిక్షణ పూర్తయిన అనంతరం నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాల కోసం షరతులతో కూడిన ఉద్యోగ ఎంపిక ధృవీకరణ పత్రం అందజేయనున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మంజిల్లా పరిధిలోని నర్సింగ్, ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

# ప్రజాపాలనలో అభివృద్ధి పథంలో వైరా మున్సిపాలిటీ



**-షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో వ్యాపారాభివృద్ధికి ఊతం**
**-మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలనలో వైరా మున్సిపాలిటీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్నామని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. వైరా రింగు రోడ్డులో త్వరలో ప్రారంభం కానున్న నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ స్థలాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, ఏఈ శ్రీమన్‌తో కలిసి చైర్‌పర్సన్ చంద్రకళ పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సహకారంతో పాటు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రింగు రోడ్డులో నిర్మించనున్న ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ పూర్తయితే మున్సిపాలిటీకి ఆదాయ వనరులు పెరగడంతో పాటు స్థానిక వ్యాపారులకు మెరుగైన వాణిజ్య అవకాశాలు లభిస్తాయని ఆమె అన్నారు. ఈ ప్రాజెక్టు వైరా పట్టణ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని, ప్రజలకు మరిన్ని సౌకర్యాలు అందించే దిశగా మున్సిపాలిటీ కృషి చేస్తుందని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యత నిర్మాణ వేగంపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తోటకూర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ ఎన్నికల వీడియోగ్రఫీ బిల్లులు వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల విధులలో భాగంగా వీడియోగ్రఫీ బాధ్యతలను నిర్వహించిన పెనుబల్లి మండల ఫోటోగ్రాఫర్లకు ఇప్పటి వరకు పారితోషిక బిల్లులు చెల్లించకపోవడం దారుణమని పెనుబల్లి మండల ఫోటోగ్రాఫర్ల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సోమవారం పెనుబల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఫోటోగ్రాఫర్ల సంఘం మాజీ ఉపాధ్యక్షులు గోదా శ్రీనివాసరావు, పెనుబల్లి మండల అధ్యక్షులు కొనకళ్ల మధు, ఉపాధ్యక్షులు సోము ఈశ్వరా చారి, మండల కార్యదర్శులు చాట్ల భద్రం, అనంతోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నివారిద్దాం ఆరోగ్యానికి పాడుకుందాం

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ప్లాస్టిక్ నివారిద్దాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ప్రజలను ప్లాస్టిక్ పట్ల అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ వలన జరిగే నష్టాలను గురించి తెలుసుకునే విధంగా చైతన్యం చేయాలనే ఉద్దేశ్యంతో ప్లాస్టిక్ ప్లేట్లలో భోజనం చేయకుండా తమ ఇంటి వద్ద నుండి తెచ్చుకున్న స్టీల్ ప్లేట్లలో భోజనం చేశారు. ఈ కార్యక్రమానికి గుట్ట బడి ఉపాధ్యాయులు లయన్స్ జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ మండల రిసోర్స్ పర్సన్లు పెనుగొండ ఉపేంద్రరావు, గంజినబోయిన రామకృష్ణ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు స్టీల్ ప్లేట్లు తీసుకొని వెళ్లడం సాధ్యం కాని పక్షంలో మోదుగు ఆకులతో తయారు చేసిన వాటిని వాడే విధంగా ప్రోత్సహించాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# యువత మారితేనే దేశ భవిష్యత్తు



**-ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి**
**-ఘనంగా ఏఐవైఎఫ్ 22వ నేలకొండపల్లి మండల మహాసభలు**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేటి యువత దేశ భవిష్యత్తుకు పునాది అని, యువత సరైన దిశలో నడిస్తేనే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని ఏఐవైఎఫ్ (ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి అన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉండి, భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని అన్యాయాలపై ప్రశ్నించే చైతన్యవంతులుగా ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో పాల పాటి అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఏఐవైఎఫ్ 22వ మండల మహాసభల్లో ఆయన మాట్లాడారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమాలు దేశవ్యాప్తంగా చైతన్యం తీసుకొచ్చాయని, ఆ పోరాటాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే రాజీనామాతో సమస్యలు ముగిసిపోవని, విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.వరుస పరీక్షా అక్రమాలకు కేంద్రంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ను వెంటనే రద్దు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ2020)ను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమాల్లో గాయపడిన విద్యార్థులకు ఉచిత వైద్యం అందించడంతో పాటు, పేపర్ లీకేజీలు, ఆందోళనల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.మహాసభ అనంతరం ఏఐవైఎఫ్ నేలకొండపల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలపాటి అశోక్ ప్రధాన కార్యదర్శిగా, ఆలేటి ఉమామహేష్ అధ్యక్షుడిగా, పెదపాక నాగరాజు సహాయ కార్యదర్శిగా, గోపినాథ్ ఉపాధ్యక్షుడిగా, మరో 19 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన బాధ్యులు మాట్లాడుతూ, మండలంలో గంజాయి, డ్రగ్స్ వంటి సామాజిక రుగ్మతలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి మరింత ఉత్సాహంగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ మహాసభలో సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు చింతల రమేష్, మల్లెబోయిన ఉపేందర్, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, భద్రాజీ వెంకటేశ్వరరావుతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## పోకల దమ్మక్క సేవా యాత్రకు రావాలని ఐటిడిఏ పిఓకు ఆహ్వానం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో జరిపే ఆపర శబరి పోకల దమ్మక్క సేవా యాత్ర కు రావాలంటూ అర్చక స్వాములు సోమవారం పిఓ చాంబర్‌లో మర్యాయదపూర్వకంగా కలిసి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే పోకల దమ్మక్క సేవా యాత్రలో పాల్గొనాలని అధికారికంగా అర్చక స్వాములు మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలతోపాటు ఆహ్వానం పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి అనుగ్రహానికి పాత్రురాలు అయిన అభినవభక్త శబరి పోకల దమ్మక్క అని, ప్రత్యేకంగా పోకల దమ్మక్క యాత్రకు వివిధ గిరిజన గ్రామాల నుండి గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నందున సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఘనంగా నిర్వహించాలని దేవస్థాన అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యంగా ఆలయ ఆచారాలు, పూజా విధానాలు, ఉత్సవ కార్యక్రమాలు పురాతన సంప్రదాయాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా సేవా యాత్ర సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, దర్శన సౌకర్యాలు, శాంతి భద్రతలు, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున దేవస్థానం అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భవాని రామకృష్ణ, పర్యవేక్షకుడు శ్రీనివాసరెడ్డి, అర్చక స్వాములు విష్ణు, ఎస్వి.మదన్‌మోహన్ ఆచారి పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజుకు ఘన వీడ్కోలు



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెంరాజు ఈ నెల 31న పదవీవిరమణ పొందనున్న సందర్భంగా సోమవారం ఉదయం ఆర్‌సిహెచ్‌పి కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని జీఎం షాలెంరాజుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి పదవీవిరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియా అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి పెంపు, కార్మిక సంక్షేమం, భద్రతా ప్రమాణాల అమలులో షాలెంరాజు అందించిన సేవలు విశేషమని కొనియాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూ యాజమాన్యం కార్మికుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఎస్) ఆర్‌సిహెచ్‌పి హెచ్‌వోడీ జె.లింగ, ఈఈ యశస్వి, ఎన్‌వోటు జీఎం గోవిందరాజు, ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, ఆఫీస్ పీఓవి పి.వీరభద్రమ్మ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అనిల్, యోగేంద్రనాథ్, అనూష, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి జె.గట్టయ్య, నాయకులు ఎం.సురేందర్, యు.శివదర్శన్, ఎస్.నాగేశ్వరరావు, ఆర్.మురళి, జి.రాంబాబు, టి.రమేష్, ఐఎన్‌టియూసీ నాయకులు కే.కుమారస్వామి, ఎస్.సాంబశివరావు, సమ్మయ్య, బీఎంఎస్ నాయకుడుడ రవి, హెచ్ఎంఎస్ నాయకుడు పూర్ణతోపాటు ఆర్‌సిహెచ్‌పి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులను సకాలంలో పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** జిల్లా నలు మూలల నుండి వచ్చి ప్రజావాణిలో సమర్పించిన ధరఖాస్తుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంభందిత అధికారులను ఆదేశించారు. ఐడిఓసిలో జరిగిన ప్రజావాణికి హాజరైన ఆయన ప్రజల నుండి పలు వినతులను స్వీకరించి పరిశీలించారు. అనంతరం వాటిని సంభందిత అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని ఇక్కడి దాకా వచ్చి వినతులు సమర్పిస్తారని వాటిని పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపకుంటే ప్రభుత్వ ఉద్యోగులుగా అర్థం లేదన్నారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్రనివేదికలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణపై మరింత కఠిన చర్యలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** మాదక ద్రవ్యాల నియంత్రణలో మరింత కఠినమైన చర్యలు తీసుకొంటామని ఎస్పి బిరుదురాజు రోహిత్‌రాజు అన్నారు. ఎస్పి కార్యాలయంలో ఎన్‌డిపిఎస్ కేసుల పురోగతిపై జిల్లాస్థాయి సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిక చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. పరారీలో ఉన్న నిందితులను అరెస్ట్ చేసి, అక్రమ మాదక ద్రవ్యాల రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల వినియోగదారులకు కౌన్సిలింగ్, డి అడిక్షన్ సేవలు అందించడంతో పాటుగా యువతలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనిపేర్కొన్నారు.సమావేశంలో జిల్లాలోని డిఎస్‌పిలు,సిఐలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** చుంచుపల్లి మండలం బాబుక్యాంపు గ్రామపంచాయతీ 8వ వార్డులో డ్రైనేజీ (కాలువ) నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకన్న ఆధ్వర్యంలో బాబుక్యాంపు సర్పంచ్ నూనావత్ కుమారి, ఉప సర్పంచ్ పోలమూరి శ్రీనివాస్ చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూనావత్ కుమారి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలు ఇచ్చిన హామీల మేరకు బాబుక్యాంపులో అవసరమైన ప్రాంతాల్లో కాలువలు, రోడ్ల నిర్మాణ పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మేఘ్య, అమ్ములు, సీపీఐ నాయకులు ఎలుక చందర్, రాయనర్సు, జె.ఎంఏ. పాషా, కాంట్రాక్టర్ మిడిదొడ్డి సంతప్ కుమార్, బంటి తదితరులతోపాటు 8వ వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరకగూడెం ఎంపీడీవోగా శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన పోడిల శ్రీనివాసరావు ని సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఎంపీడీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోజిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎర్ర సురేష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు చౌలం కేశవరావు, ఉపాధ్యక్షులు కల్తి విజయ్, కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత, బట్టుపల్లి సర్పంచ్ తోలెం రమాదేవి,చిరుమల్ల సర్పంచ్ కొమరం సుగుణ, రేగళ్ల సర్పంచ్ బాడిష పార్వతి, పద్మాపురం సర్పంచ్ తోలెం రమేష్, చొప్పాలా సర్పంచ్ తోలెం సావిత్రి, గొల్లగూడెం సర్పంచ్ ఏళ్లబోయిన ముత్తమ్మా, మాజీ ఉపసర్పంచులు కొమరం, వెంకటేశ్వర్లు బాడిష లక్ష్మీ నారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపికైన మహాత్మా జ్యోతి పూలే విద్యార్థులు



**ప్రజాపక్షం/కరకగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి యోగాసనా పోటీలు సోమవారం జిల్లా కేంద్రం లో నిర్వహించిన పోటీలలో రిథమిక్ పెయిర్ గోల్డ్ మెడల్ కె. కౌశిక్, పి. శివకుమార్, ట్రెడిషనల్ జి. తరుణ్, గోల్డ్ మెడల్, జి. శ్రీరామ్ సిల్వర్ మెడల్, ఏ. సాత్విక్, బ్రోంజ్ మెడల్ ఆర్టిస్టిక్ పెయిర్ ఏ భవన్ ఏ భరత్ గోల్డ్ మెడల్ ఇంకా అన్ని రకాల విభాగాలలో విజయం సాధించడం జరిగింది. సెప్టెంబర్ నెలలో మహబూబ్ నగర్ జిల్లా లో నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగాసనా పోటీలకు వీరు ఎంపిక అయ్యారు అని పాఠశాల ప్రిన్సిపల్ పి. రజనీ మేడం తెలిపారు.

## నేటితో ముగియనున్న అంగన్వాడీ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన



**ప్రజాపక్షం/మణుగూరు :** అంగన్వాడీ టీచర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నేటితో ముగియనున్నట్లు సిడిపిఓ జయలక్ష్మి తెలిపారు. అంగన్వాడీ ఉద్యోగానికి ఆన్‌లైన్ చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్లు సకాలంలో వేరిఫికేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు. ఆన్లైన్ లో అప్లోడ్ చేసిన సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ సంతకాలు చేయించుకొని పట్టణ కేంద్రంలోని శ్రీశ్రీ నగర్ కాలనీలో గల ఐసిడిఎస్ ప్రాజెక్టు మణుగూరు కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అంగన్వాడీ టీచర్ల ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులందరూ నేడు చివరి తేదీ ఉన్నందున అందరూ పని వేళల్లో కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు.

## గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/కామేపల్లి:** వర్షాలు కురిసి సాగు సజావుగా సాగాలని కోరుతూ గ్రామస్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరువాక పండుగ సమీపించినా వర్షాలు లేకపోవడంతో ఆందోళన చెందిన రైతులు వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు బొడ్రాయి వద్ద పూజలు చేశారు. అనంతరం గ్రామంలో కప్పలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు ఇంటింటా కప్పలకు నీళ్లు పోసి వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. ఈకార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి పునాది

**ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క**



**ప్రజాపక్షం/మధిర:** భారత రాజ్యాంగం పౌరులందరికి కల్పించిన ఓటు హక్కును పరిరక్షించడమే ప్రజాస్వామ్యానికి అసలైన సూత్రమని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. ఓటర్ల జాబితా సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బిఎల్‌వోలు బాధ్యతాయుతంగా వ్యవహరించారని, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కితాబిచ్చారు. మధిర నియోజకవర్గానికి చెందిన బిఎల్‌ఏలు, వారి కుటుంబ సభ్యులతో మాటూరుపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన చెందిన ఓటర్ల పేర్లను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాంకేతికత ద్వారా గురితచి తొలగించే కుట్రలు జరుగుతున్నాయని భట్టి ఆరోపించారు. బిజెపి నేతృత్వంలో ఇప్పటికే అనేక రాష్ట్రాటల్లో ఈ రకంగా ఓట్లను తొలగించి లబ్ది పొందారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికే తీవ్ర ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కును కోల్పోతే భవిష్యత్తులో రేషన్‌కార్డులు, ప్రభుత్వ, సంక్షేమ పథకాలు ఆఖరికి ఈ దేశ పౌరసత్వం కూడా ప్రశ్నార్థకమై డిటెన్షన్ సెంటర్లకు వెళ్లాల్సిన దారుణ పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. మధిర నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపు 90% ఓర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 10 శాతంలో చనిపోయిన వారి వివరాలను తొలగించడం, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని గుర్తించడం వంటి పనులను బూత్‌ల వారీగా పరిశీలించి 100% నమోదు ప్రక్యిను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్న పిసిసి ప్రతినిధులను అభినందిస్తూ, బిఎల్‌ఏలు ఎటువంటి విసుగు చెందకుండా సమన్వయంతో పనిచేసి ఈ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి కోరారు.

### సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించిన భట్టి...



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, బలమైన ఆహార సేవలు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ప్రారంభించారు. అనంతరం మధిర మార్కెట్‌యార్డ్‌లో ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిధిగా హాజరై జ్యోతిప్రజ్వాలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన, బలమైన ఆహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమాజంలోని బలహీన వార్గలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగుల నిరసన

**ప్రజాపక్షం/వైరా:** విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర పవర్ జేఏసి ఇచ్చిన పిలుపు మేరకు వైరా డివిజనల్ కార్యాలయం వద్ద సోమవారం ఎన్‌పిడిసిఎల్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరిస్తే ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు సబ్సిడీల కొనసాగింపు కష్టసాధ్యమవుతుందని, విద్యుత్ చార్జీలు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యుత్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని, కార్మికులు, ఉద్యోగులు అన్ని ఉద్యోగ సంఘాలు ఐక్యంగా పోరాడితేనే ప్రజా రంగ సంస్థలను పరిరక్షింపకోవడం సాధ్యమవుతుందని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం అందరూ ఒకే వేదికపైకి వచ్చి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర పవర్ జేఏసి కార్యవర్గ సభ్యులు రాజరత్నం, నరసింహారెడ్డి, నాగేశ్వరరావు, ఎం.ప్రసాద్, జార్జి, ట్రేడ్ యూనియన్ నాయకులు, వైరా ఎలక్ట్రికల్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఏఏవో సురేష్, అధికారులు, రాజాసిన్హా, వర్మ, మంజుల, శ్రీజ, వీరభద్రరావు, పాషా, కృష్ణప్రసాద్, వివేక్‌తో పాటు పలువురు విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.




# 16వ డివిజన్‌లో ప్రారంభమైన తొలిముద్ద - బాల భరోసా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 16వ డివిజన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిముద్ద బాల భరోసా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. 15, 18, 19 అంగన్‌వాడీ సెంటర్లలో తొలిముద్ద బాల భరోసా కార్యక్రమాన్ని 16వ డివిజన్ కార్పోరేటర్ మునిగడప పద్మ చిన్నారులకు తొలిముద్దను వడ్డించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లల్లో పౌష్టికాహార లోపం ఉండకుండా వారి ఎదుగుదలలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మంచి పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలోని చిన్నపిల్లకు గోధుమ రవ్వలో అన్ని రకాల పప్పులు, పల్లీలు మొదలైన ప్రోటీన్ సహిత ఆహారాన్ని అందించాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. పిల్లలకి అందించే పౌష్టికాహారంలో కాంట్రాక్టర్ నాణ్యత లోపం లేకుండా ముడి పదార్థాన్ని అందించాలని, ఆ బాధ్యతను అంగన్‌వాడీ టీచర్స్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు ఉందని అన్నారు. 15, 18, 19 సెంటర్ల టీచర్లు, ఎన్ సరోజ, ది.నీలవేణి, షహనాజ్ బేగం, ఆయమ్మ వెంకటలక్ష్మి, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఐటిడిఏ పిఓ



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో వైద్య శిభిరాలను నిర్వహిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన పలు గిరిజన ప్రాంతాల నుండి తరలి వచ్చిన ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలు వర్షాకాలంలో రోగాల భారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.అర్హులైన ప్రతీ ఒక్కరికి ఐటిడిఏ నుండి ప్రభుత్వ పథకాలను దశల వారీగా అందుతాయని తెలిపారు. దీనిపై దళారుల మాయలో పడొద్దని సూచించారు.అనంతరం ధరఖాస్తులను పరిశీలించిన పీఓ సంభంధిత అధికారులకు బట్వాడా చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే అధికారులపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుందని అన్నారు. పరిష్కారానికి నోచుకోని ధరఖాస్తులపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# జిపి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**-జిపి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి, మహాసభల ఆహ్వాన సంఘం కార్యదర్శి పిట్టల మల్లయ్య తెలిపారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర మూడవ మహాసభ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మల్లయ్య తెలిపారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఎండి యూసఫ్ (ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు),రాష్ట్ర అధ్యక్షులుగా టంగుటూరి నర్సింహారెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వాసిరెడ్డి మురళి, ప్రధాన కార్యదర్శిగా బి. వెంకటరాజం, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పిట్టల మల్లయ్య, కోశాధికారిగా ఆదిరాల రామచంద్రయ్యతో పాటు 65 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మహాసభలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయని గ్రామ పంచాయతీ ఉద్యోగుల, కార్మికుల సమస్యలపై చర్చించడం జరిగిందని మల్లయ్య తెలిపారు.మహాసభల నిర్వహణకు సహకరించిన వారందరికీ ఆహ్వాన సంఘం తరుపున మల్లయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సహకార విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లా సహకార విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం సోమవారం ఖమ్మం నగరంలోని గ్రాండ్ గాయత్రి హోటల్‌లో ఘనంగా జరిగింది. 15 ఏళ్ల తర్వాత పూర్వ విశ్రాంత ఉద్యోగులు ఒక చోట కలుసుకున్నారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు వారు నిర్వర్తించిన బాధ్యతలను, సేవలను, తీపి గుర్తులను, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. పదవి వీరమణ పొందిన తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడి కలుసుకోవాలని ఉన్న అవకాశం కలగలేదన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళన బాధ్యులు కెఎస్ గోపాల్, కాశబోయిన అనంతరాములును తోటి మిత్రులు సత్కరించి అభినందించారు. ఈ సమ్మేళనంలో రిటైర్డ్ అధికారులు నల్లమల పూర్ణచందర్‌రావు, సుబ్రహ్మణ్యం, గోపాల్, ఈగ పుల్లయ్య, బానోత్ వెంకటేశ్వర్లు, బాలసుబ్రహ్మణ్యం, దుగ్గి నర్సింహారావు, దేవులపల్లి శ్యామ్‌సుందర్, శీలం అప్పిరెడ్డి, ముత్యాల వీరభద్రం పాల్గొన్నారు.

# వనమా విశ్వేశ్వరరావును పరామర్శించిన జర్నలిస్టులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా వర్తక సంఘం రాష్ట్ర నాయకులు వనమా విశ్వేశ్వరరావు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందిన అనంతరం ఇటీవల స్వగృహానికి చేరుకున్న విషయం తెలుసుకున్న వైరా జర్నలిస్టులు ఆయనను మర్యాదపూర్వకంగా పరామర్శించారు. సీనియర్ జర్నలిస్ట్ పొరుపల్లి కృష్ణారావు అధ్యక్షతన జర్నలిస్టుల బృందం సోమవారం వైరాలోని వనమా విశ్వేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ పొరుపల్లి కృష్ణారావు మాట్లాడుతూ వనమా విశ్వేశ్వరరావు పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ వైద్యులు సూచించిన విధంగా విశ్రాంతి తీసుకుంటూ ఆరోగ్య నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జర్నలిస్టుల ఆప్యాయ పరామర్శకు వనమా విశ్వేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. తమ ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి ప్రత్యేకంగా ఇంటికి రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పులి కృష్ణార్జునరావు, గొల్లమందల విజయ్, మోదుగు వినోద్, నల్లమోతు శ్రీనివాసరావు, ఆదూరి ప్రేమ్, చెర్రీ, వెన్నపూస వీరారెడ్డి, ధర్మపురి రవితేజ, ఆది శ్రీకాంత్, భూక్యా శ్రీనివాసరావు, సాయి కృష్ణ, మామిళ్లపల్లి విజయ్, అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

# మోడరన్ టాయిలెట్స్‌కు శంకుస్థాపన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డు చెరువు బజార్ ప్రాంతంలో వాకింగ్‌కు వచ్చే ప్రజలు, సౌకర్యార్థం ఆధునిక(మోడరన్) ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ ఆ వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి, రత్నాకర్‌తో కలిసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు పరిశుభ్రమైన, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ టాయిలెట్లను నిర్మిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే ప్రజలకు ఈ మోడరన్ టాయిలెట్స్ ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ గంగారావు, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, ఏఈ శ్రీమన్య, పాలేటి నర్సింహారావు, వేముల రత్నాకర్, పానం భాస్కర్, షేక్ ఉద్దండు, ఖమ్మం మీరా, బుర్ర సర్వేశ్వరరావు, రాచబంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్‌వో



**ప్రజాపక్షం/మధిర:** మధిర మండల పరిధజలోని మాటూరుపేట పిహెచ్‌సి ఖమ్మం జిల్లా డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ వేణుమాదశ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భగా మాటూరుపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వీరబాబు, సిబ్బందిని ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ ఆఫీసర్ నుండి వ్యాక్సిన్, నిల్వ ఉన్న వైల్స్ గురించి తెలుసుకొని కోల్డ్ చైన్ సిస్టం తప్పనిసరిగా మెయింటైన్ చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి నందు లాబరేటరీలో ఉన్న పరికరాలు ఏ విధంగా పనిచేస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకి అవగాహన కల్పించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో తరచుగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించడం జరిగింది.